ఈ మాటకు వాడు కొద్దిగా బాధపడ్డట్టు వాడి ముఖం సూచించింది.

"ఏంలేదోయ్! ఊరికే నీబోటి స్నేహితుల్ని చూచిపోదామని వచ్చాను" అన్నాడు.

నేనేమీ అనలేకపోయాను. అంతకన్నా "నీబోటి వాళ్ళను ఏడిపిద్దామని వచ్చాను" అంటే బాగుండేదేమో!

ఎలాగయితేనేం, నేనుఅప్పుడప్పుడు బియ్యం లేదన్నందుకు నా భార్యమీద ఎగిరినందుకు, ఇంకా అప్పుడప్పుడు పరోక్షంగా అన్న మాటలకు వాడు తట్టుకోలేక ఇంటికి వెళ్ళిపోతానని బెడ్డింగు రెడీ చేసుకుని తయారయ్యాడు. నేను భగవంతుడికి కృతజ్ఞతాభి వందనాలర్పించాను.

వాడు రైలుకు వెళ్ళిపోయాడు. నేనురాత్రి భోంచేసి పేపరు చదువుతూంటే వాడు తిరిగి వచ్చాడు. నేను ఆశ్చర్యపోయి "ఏమోయ్! తిరిగి వచ్చేశావేం?" అన్నాను.

"డీసెల్ అందలేదోయ్. రేపు ప్రొద్దున తొమ్మిదింటికి వెడతాను" అన్నాడు. ప్రయాణం ఆగిపోయింది. అనందించాను.

వాడు మరునాడు ప్రొద్దున ఏడింటికే ఎక్కడికో వెళ్ళి పదింటికి తిరిగివచ్చి "ఈ పాటికి మా ఊరు పోయేబండి వెళ్ళిపోయుంటుం దను కుంటా" అన్నాడు. నేను సమాధానం చెప్ప లేకపోయాను.

సాయంత్రం బయలుదేరుతూ వాడు 'బ్రదర్ ఒక పదిరూపాయ లీయవోయ్. అత్యవసరం. మళ్ళీ నీ ఋణం తీర్చుకుంటా' అన్నాడు. ఈ ఋణం తీర్చుకొంటా ననేది పరిపాటయి పోయింది. నేను సరేనని వాడికి పది రూపాయ లిచ్చివాడు మళ్ళీ తిరిగి వస్తాడేమోనని కూడా వెళ్ళి రైలెక్కించి పంపివచ్చాను.

తరువాత రెండు మూడు నెలలకు నేను వాడి ఊరు వెళ్ళినప్పుడు దురదృష్టం కొలదీ పర్సుపారేసుకున్నాను. శేఖర్ గాడినికలుసుకొని రైలు ఛార్జీకైనా ఒక రూపాయిమ్మ నడిగాను.

వాడు "తెస్తాను. ఉండు" అని అదే పోవటం పోయాడు. ఎంతకీ రాకపోయేసరికి వాడి ఇంటికి వెడితే వాడక్కడ లేడు. అతని భార్యామణి "అప్పుడే ఎవరినో స్నేహితుడిని చూడాలని బస్సెక్కి వెళ్ళారు" అంది.

"శేఖర్ కి ఏమీ ఉద్యోగం దొరకలే దాండి?" అన్నాను.

"లేదండి" అన్న దామె.

"ఈ స్నేహితులను చూచే ఉద్యోగ ముండగా మరొక టెందుకు. ఓ ప్రియ స్నేహితుడా! ఆనాటి ఋణాన్ని అద్భుతంగా తీర్చు కున్నావోయ్!" అనుకుని ఓ పెద్ద మనిషిదగ్గర రూపాయ పుచ్చుకుని మా ఊరు చేరుకున్నాను.

కథానిక

# అర్థంకాని శశి

### ఇచ్ఛాపురపు జగన్నాధరావు

మూడేళ్ళ క్రిందట—

కృష్ణమూర్తి ఇంటికి వెళ్ళినప్పుడు ఏదో పిచ్చాపాటీ మాటలాడుకుంటూంటే శశి వివాహ ప్రస్తావన వచ్చింది.

శశి అంటే శేఖరం చెల్లెలు. చాలా అందమైనదీ, తెలివైనదీను. స్కూల్ ఫైనల్ ప్యాసయింది. శేఖరం నాకెంత సన్నిహితుడో ఆమె కూడా అంత చనువుగాఉండేదినాతో. ఆధునిక సంస్కారం గల శేఖరమూ, వాళ్ళ తల్లి దండ్రులూ ఆమెకి అడ్డుచెప్పరు ఏ విషయం లోనూ. సినీమాకి వెళ్ళాలంటే "నాన్నా, సినీమాకి వెళ్ళొద్దూ?" అని అడుగుతుంది. "వెళ్ళమ్మా. నీకు అభ్యంతరం ఏముంది?" అన్న సమాధానం తప్పదు. ఏ సినీమాకో, ఎవరితోనో, ఆయన పట్టించుకోడు. శేఖరమూ, తల్లీ సరేసరి. కాని, వివాహవిషయంలో శశి పూర్ణస్వాతంత్ర్యం ఈయబడడమూ, ఆమె ఆ నిర్ణయాధికారాన్ని తండ్రికి తిరిగి వప్పచెప్ప

డమూ విన్నాక ఆమె జీవితం ఎలాగ సాగుతుందో చూద్దామని నాకు బుద్ధిపుట్టింది. స్త్రీ విద్య అన్నా, వాళ్ళకి వివాహస్వాతంత్ర్యం ఇవ్వడమన్నా నాకు చాలా ఇష్టం.

అందుకని శశి పెళ్ళిని గురించి వాళ్ల ఫూరు వెళ్ళినప్పుడు కృష్ణమూర్తి నడిగితే "ఆ వ్యవహారం చాలా విచిత్రంగా నడుస్తోందిలే" అన్నాడు.

"ఆమె పరిస్థితి అలాటిదిలే. అయినా చెప్పు విశేషం ఏమిటో" అన్నాను.

"ఆమెని పెళ్లి జేసుకోవడానికి ముగ్గురు పెళ్ళికొడుకులు చూస్తున్నారు."

"ఎవరదీ?"

"ఒకటోవాడు మోహనరావు, రెండోవాడు శ్రీనివాసు, మూడోవాడు రఘుపతి."

ముగ్గురూ నా స్నేహితులే. మోహనరావు గ్రాడ్యుయేటు. మనిషి ఆకర్షించేలాగే ఉంటాడు. ముఖ్యంగా చాలా పెద్ద ఆస్తిపరుడు. ఏలూరులో రెండు ఇళ్ళు ఉన్నాయి. చాలా తెలివైనవాడు కూడాను.

శ్రీనివాసు మెడికల్ ప్యాసయ్యాడు. నేడో రేపో ప్రాక్టీసు పెడతాడు. మనిషి చాలా బాగుంటాడు. చక్కటి పాట ఉంది. పెద్ద ఆస్తి లేదుగాని అభ్యుదయభావాలపరిమితంగా ఉన్నాయి.

రఘుపతి గ్రాడ్యుయేటు అయ్యాక ఉపాధ్యాయవృత్తి అవలంబించాడు. మనిషిలో సౌందర్యం తక్కువ. కాని బలిష్ఠమైన దేహం. పెద్ద ఆస్తిలేదు. ప్రబంధ యుగంనాటి మనిషిలాగ కనిపిస్తాడు.

ఇదంతా మనస్సులో ఉంచుకుని అన్నాను. "అయితే శశి మోహనరావునో, శ్రీనివాసునో పెళ్ళాడాలన్నమాట."

"రఘుపతిని వదిలేశావేం?" సమందహాసంగా అన్నాడు మిత్రుడు. సమందహాసంగానే "శశికీ అతనికీ మధ్య 500 సంవత్సరాలున్నాయ్" అన్నాను.

కృష్ణమూర్తి కొంచెంఆగి ఏదో ఆలోచిస్తూ—"కాని శశిమనస్సు ఎవళ్ళకీ తెలియడంలేదోయ్. ఆమె ఆ ముగ్గుర్నీ ప్రేమించిందో, ఒకళ్లనీ ప్రేమించలేదో తెలియడం లేదు. ఎవరినీ దూరంగా ఉంచదు. అలాగని దగ్గరకీ రానియ్యదు. చాలా గమ్మత్తుగా ఉందిలే" అన్నాడు.

ఆ విషయం గురించి తరవాత ఆట్టే మాటాడకుండా మరో విషయానికి జరిగిపోయాము.

* * *

పోస్టుమేన్ ఆనాటి టపాకి ఇచ్చిన రెండు శుభలేఖలూ చదివాక మూడేళ్ల క్రితం కృష్ణమూర్తి ఇంటిదగ్గర సంభాషణా, మోహనరావూ, శ్రీనివాసూ జ్ఞాపకం వచ్చారు. రఘూ, శశీ పెళ్ళికి రమ్మని వేరువేరుగా చాలా బలవంతంగా ఉత్తరాలు వ్రాశాక వెళ్ళక తప్పింది కాదు.

మొదట కృష్ణమూర్తి ఇంటికి వెళ్ళాను. "కథ అడ్డంగా తిరిగిందేమిట్రా బ్రదర్?" అన్నాను సాశ్చర్యంగా. కాని కృష్ణమూర్తి నా పరిస్థితిలోనే ఉన్నాడు. శ్రీనివాసుని కాక, మోహనరావునీ కాక, రఘుపతిని శశి వివాహం చేసుకోడానికి ఏదో కారణం ఉండాలని గ్రహించాను.

రఘుపతిని అభినందించడం అయ్యాక కృష్ణమూర్తీ, నేనూ షికారుకని పోయాం. దారిలో మోహనరావునీ శ్రీనివాసునీ కూడా పిల్చుకుని వెళ్ళాము.

మోహనరావు చాలా విచారంగా, ఏదో బాధపడుతున్నట్టు ఉన్నాడు. శ్రీనివాసు మరి చెప్పనే అక్కర్లేదు. ఏదో పోగొట్టుకున్నవాళ్ళా కనిపించేడు.

"మూడు సంవత్సరాల తరువాత నిన్ను చూడ్డం చాలా ఆనందంగా ఉందిరా"



అన్నాడు దార్లో మోహనరావు.

"ఉత్తరాలకి జవాబేనా రాయవు. అంత బద్ధకం అయితే ఎలాగరా?" నిష్ఠూరం వేశాడు శ్రీనివాసు.

"ఇటుపైని తరచు వస్తూంటానురా. ఉత్తరాలూ జాగ్రత్తగా వ్రాస్తూంటాను" అన్నాను సమాధానంగా.

"రఘుపతి చాలా అదృష్టవంతుడురా" ధైర్యంచేసి అనేశాను వాళ్ల వాలకాలు చూశాక అమాట అనడం అంతగా ఇష్టం లేకపోయినా.

రెండు క్షణాలు నిశ్శబ్దంగా గడిచాక మోహనరావు అన్నాడు... "ఏమిరా అలాగన్నావు? ఏదో ఉద్దేశం పెట్టుకున్నావల్లే ఉంది. తిన్నగా చెప్పు."

"ఉద్దేశం ఏమీలేదు. నవ్వో, నీనో ఆమెని వివాహం చేసుకుంటారనుకున్నాను. లోకం అలాగే అనుకుంది కూడా. కాని మీ ఇద్దరినీ వదిలి శశి రఘుపతిని వివాహం చేసుకోంటూం దంటే ఆడవాళ్ల ఆలోచన లెంత కారణ హీనాలో అవగతం అవుతూంది" అన్నాను ఓ వేదాంతి పోజులో.

శ్రీనివాసు అందుకుంటూ–"ఆడవాళ్ల ఆలోచనలు కావు కారణహీనమైనవి. అదృష్టపు టడుగుదారులు" అన్నాడు.

ప్రశ్నార్థకంగా చూశాను

మోహనరావు అంటుకుని "ఎవ్వరికీ చెప్పనంటే మీకీ కథ అంతా చెప్తాను. చాలా రహస్యంగా ఉంచుతామంటే"

దానికేముందీ? "అలాగే"నన్నాము.

అతను చెప్పసాగాడు.

"ఈ కథ వినేముందు నేను చెప్తున్నాను కనక రెండు విషయాలు మీరంగీకరించాలి.

ఒకటి : శశి వివాహం విషయంలో ఆమె ఏ ఉద్దేశమూ లేకుండా అంటే మనస్సులో ఎవరినీ ప్రేమించకుండా తండ్రియెడల భక్తి కొద్దీ అను - మరేమను - తన వివాహపు నిర్ణయాధికారాన్ని ఆయనకే వదలిందనీ,

రెండు : నాకూ శ్రీనివాసుకీ ఉండే అనేక సంబంధాలవల్ల ఎటువంటి పరిస్థితుల్లోనూ విడిపడని స్నేహితులం అనీ.

ఇక కథ ఆరంభిస్తాను. నేనూ, శ్రీనివాసూ కూడా శశిని ప్రేమించాము. కాని ఆ సంగతి ప్రతి ఒకరమూ రెండవవాడివద్ద రహస్యంగానే ఉంచాము.

కేవలం నేను మాత్రమే ఆమెని ప్రేమిస్తున్నాననే భావంతో ఆమె ప్రేమ పొందడానికి ప్రయత్నించాను. ఆ ఉద్దేశంతోనే శ్రీనివాసూ ఆమెని ప్రేమించాడు.

కాని మా యిద్దరికీ రహస్యాలు లేవు. ఒక రోజున మా విషయాలు ఇద్దరమూ చెప్పుకున్నాము. ఇద్దరమూ ఆమెని వివాహ దృష్టితో ప్రేమించినట్లు తెలిసికొన్నాము.

నేను చాలా వ్యథపడ్డాను జరిగిన దానికి–శ్రీనివాసరావు శశిని ప్రేమిస్తే నేనుపోటీ వెళ్లబోయినందుకు. ఆ రాత్రి శశిని కలుసుకుని చెప్పాను ఆమెని నేను సోదరిగా మాత్రమే ప్రేమించబోతున్నానని.

మోహనరావూ అలాగే చేశాడు. అతను ఆ మరునాడుదయం శశి తండ్రితో మాటల సందర్భంలో తాను మరో పిల్లని వివాహం చేసుకోబోతున్నట్లు చెప్పాడు.

శశికి ఇంక రఘుమాత్రమే పరిచయానికీ, ప్రేమించడానికీ మిగిలాడు. ఈపాటి సోషల్‌గా తిరిగే పిల్లకి సంబంధం మరెవరూ చెప్పలేక పోయారు...

ఇలాగ రఘు శశిని గెలిచాడు."

* * *

కథనమంతా అయ్యాక ఊరుకోలేక అన్నాను: "మీరిద్దరూ నిర్ణయించుకుని ఒకరు తప్పుకునివుంటే ఈ విషాదాంతం సంభవించక పోవును" అని.

శీను విషాదంగా నవ్వుతూ– "రఘు వివాహ పత్రిక చేరాకనే పూర్తికథ మాకూ తెలిసింది. ఈనాడు మేం విచారిస్తే అది రెండోవాళ్ల నష్టానికే గనక మరీ బాధాకరం అయింది" అన్నాడు అసలు సంగతి తేలుస్తూ.

ఆరాత్రి మంగళసూత్ర బంధన చేస్తూ రఘుపతి చిరునవ్వుకి శశి ఇచ్చిన అత్యంత ప్రేమ పూరితమైన చిరునవ్వుని చూస్తూంటే ఒళ్లు ఝల్లుమన్నది.

కాని శశి అంటే ఏమిటో అగమ్యం అయిపోయింది.